నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 26 అక్టోబర్ 2024 | SIDDIPET

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకున్నారా?

- ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ షురూ..
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తులకు గడువు నవంబర్ 6 చివరి తేదీ

బొల్లారం, అక్టోబర్ 25: త్వరలో జరగబోయే నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. 20 21 సెప్టెంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులుగా ఈసీ తెలిపింది. డిగ్రీ పూర్తి చేసినవారు 20 25లో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇప్పుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఇప్పటికే ఈసీ ప్రకటించిన విషయం తెలిసిందే..

ఎమ్మెల్సీ ఓటు నమోదు షురూ...

ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే షురూ అయ్యింది. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఓటు నమోదు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న ఆయా నియోజకవర్గాలకు చెందిన అర్హత కలిగిన ఓటర్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి..?

గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కోసం ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు పూర్తి చేయాలి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ముందుగా https://ceotelangana.nic.in/home.html సైట్‌లోకి వెళ్లాలి. హోం పేజీలో కనిపించే ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ – టీచర్ ఆప్షన్స్ పై క్లిక్ చేయాలి. వెంటనే కొత్తవిండో ఓపెన్ అవుతుంది. 1. గ్రాడ్యుయేట్స్ 2024, 2. టీచర్స్2024, 3.ఫామ్–18 కనిపిస్తాయి. గ్రాడ్యుయేట్స్ అప్లై ఆన్‌లైన్, డౌన్‌లోడ్ అప్లెయ్ ఫామ్ అనే ఆప్షన్ ఉంది. అప్లై ఆన్‌లైన్ పై క్లిక్ చేయాలి. ఇక్కడ మీకు ఫామ్ ఓపెన్ అవుతుంది. ముందుగా మీ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎంచుకోవాలి. ఆ తర్వాత అడ్రస్, ఆధార్, విద్యార్హతలను ఎంట్రీ చేయాలి. డిగ్రీ సర్టిఫికెట్, ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. చివరలో మీ మొబైల్ నెంబర్, మెయిల్ అడ్రస్, ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. ఫైనల్‌గా సబ్మిట్ బటన్ పై నొక్కితే అప్లికేషన్ ప్రాసెస్ పూర్తి అవుతుంది. మీకు రిజిస్ట్రేషన్ నెంబర్ జనరేట్ అవుతుంది. ఈ రిజిస్ట్రేషన్ నెంబర్ సాయంతో మీ అప్లికేషన్ స్టేటస్ కూడా చెక్ చేసుకోవచ్చు. ఇక టీచర్లకు కూడా పైన పేర్కొన్న విధంగానే చేయాల్సి ఉంటుంది. కానీ టీచర్స్ ఫామ్ 19 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వివరాలతోపాటు టీచర్‌గా పని చేసిన ప్రాంతాల వివరాలను ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. ఫొటో కూడా అప్‌లోడ్ చేయాలి. చివరలో సబ్మిట్ బటన్‌పై నొక్కితే ప్రాసెస్ పూర్తి అవుతుంది.

రిజిస్ట్రేషన్ లింక్స్...

గ్రాడ్యుయేషన్ ఓటర్ నమోదు కోసం లింక్.. https://ceotserms2.telangana.gov.in/mlc/form18.aspx

టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కోసం లింక్... https://ceotserms2.telangana.gov.in/mlc/form19.aspx గడువులోపు దాఖలైన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటిస్తారు. ముసాయిదా జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 తేదీ వరకు తెలియజేయాలి. పైన పేర్కొన్న నాలుగు జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రులు ఎమ్మెల్సీ కాలపరిమితి 2025 మార్చి 29 నాటితో ముగియనున్నది.

పొట్టేలు సినిమాలో హుస్నాబాద్ వాసులు

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 25: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం విడుదలైన పొట్టేలు సినిమాలో హుస్నాబాద్ వాసులు వెండితెరపై కనిపించారు. హుస్నాబాద్‌కు చెందిన కనకం వెంకట్, బోనగిరి రజిత, ముక్కెర సంపత్, తాడూరి సురేశ్ అనే కళాకారులు ఈ చిత్రంలో నటించారు. ఈ చిత్రంలో తమ నటనతో ప్రేక్షకులను ఈ నలుగురు నటులు మెప్పించారు. సినిమాల్లో నటించే అవకాశాలు ఇస్తే తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శిస్తారని నిరూపించారని హుస్నాబాద్ వాసులు పలువురు కొనియాడారు. పాత్ర ఎటువంటిదైనా తమ అద్భుతమైన ప్రదర్శనతో సీనియర్ నటులతో సమానంగా నటించడం హుస్నాబాద్ ప్రాంతానికే గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పొట్టేలు సినిమా పోస్టర్‌లో హుస్నాబాద్ వాసులు

సీసీ నిఘాలో మెదక్ కలెక్టరేట్

- 160 సీసీ కెమెరాలు ఏర్పాటు
- కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షించనున్న కలెక్టర్
- విధులుకు హాజరయ్యే వారిపై నిఘా
- ఉద్యోగులు,విజిటర్స్ కదలికలపై కన్ను

మెదక్ కలెక్టరేట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : మెదక్ కలెక్టరేట్‌లో నిఘా పెరిగింది. కలెక్టరేట్‌లోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది ఇక నుంచి ఆలస్యంగా విధులకు వస్తే వేటు పడనున్నది. ఇక నుంచి ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటించాలి, లేదంటే సీసీ కెమెరాలకు చిక్కుతారు. మెదక్ కలెక్టరేట్‌లోని సుమారు 50 శాఖల్లో 160 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో కలెక్టరేట్ మొత్తం సీసీ కెమెరాల నిఘాలోకి వచ్చేసింది. వీటి పర్యవేక్షణకు కలెక్టర్ ఛాంబర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ప్రతి కదలికపై చర్యలు తీసుకోనున్నారు. కలెక్టరేట్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

నిత్యం వచ్చే వారి కదలికలపై నిఘా...

మెదక్ కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా సిబ్బంది పనితీరు మెరుగుపర్చడంతో పాటు కలెక్టరేట్‌లోకి తరుచూ ఎవరూ వస్తున్నారు. వచ్చిన వారు ఏ సెక్షన్‌లోకి వెళ్తున్నారు. ఆ సెక్షన్‌లో ఎవరిని ఎక్కువగా కలుస్తున్నారన్న దానిపై కూడా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించనున్నది. కలెక్టరేట్‌కు ప్రతి రోజు వచ్చే వారి కదలికలపై కూడా నిఘా పెట్టనున్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఉన్న సమయంలో విజిటర్స్ తాకిడి ఎక్కువగా ఉంటున్నది. కలెక్టర్‌ను కలిసేందుకు ఎవరు వస్తున్నారన్నది కూడా సీసీ కెమెరాల ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. కలెక్టరేట్ కారిడార్‌లో ఎవరు తిరుగుతున్నా కూడా సీసీ కెమెరాల్లో రికార్డు అవుతుంది. 160 సీసీ కెమెరాలతో కలెక్టరేట్‌లో నిఘా ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఒక్కరి కదలికను తెలుసుకోనున్నారు.

అన్ని సెక్షన్‌లలో సీసీ కెమెరాలు...

మెదక్ కలెక్టరేట్‌లో ఏ నుంచి హెచ్ వరకు సెక్షన్లు ఉన్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఈ సెక్షన్లలో పనిచేసే వారు మరింత అలర్ట్ కావాల్సిన పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్‌లో ప్రతి సెక్షన్ కీలకమైనదే. ప్రతి సెక్షన్‌లో సంబంధిత సూపరింటెండెంట్‌తో పాటు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా పరిపాలనా యంత్రాంగానికే గుండెకాయ అయిన కలెక్టరేట్ పనితీరును మరింత మెరుగుపరిచి ఇతర శాఖలకు ఆదర్శంగా ఉంచేందుకు కలెక్టర్ రాహుల్‌రాజు కసరత్తు చేస్తున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లాలో తొలిసారిగా కలెక్టరేట్ నుంచే ఈ– ఆఫీస్ విధానాన్ని ప్రారంభించారు. ఈ–ఆఫీస్ అమల్లోకి వచ్చిన తర్వాత కలెక్టరేట్‌లోని ప్రతి సెక్షన్‌కు సంబంధించిన ఫైళ్ల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరుగెత్తిస్తున్నారు.కలెక్టరేట్‌లోని ప్రతి సెక్షన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో అక్కడ పని చేసే సిబ్బంది మరింత అప్రమత్తం కానున్నారు.

పనితీరు మెరుగుపర్చడానికే..

కలెక్టరేట్‌లోని అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు శాఖల పనితీరు మెరుగుపర్చడానికే 160 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. అన్ని సెక్షన్లలో సీసీటీవీల ఏర్పాటు చేశాం. కలెక్టరేట్‌లో సీసీటీవీల సర్వేలెన్స్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తాం. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండలాల్లోని పీహెచ్‌సీలు, కమ్యూనిటీ సెంటర్స్, ఏరియా దవాఖానల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదు.

–రాహుల్‌రాజ్, కలెక్టర్ మెదక్

ఎల్గోయిని సందర్శించిన నిమ్జ్ అధికారులు

- పరిహారం రాని బాధిత రైతుల భూముల పరిశీలిన
- కలెక్టర్‌కు నివేదిస్తామని వెల్లడి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఎల్గోయిలో బాధిత రైతుల భూములను పరిశీలిసస్తున్న డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి

జహీరాబాద్/ఝరాసంగం, అక్టోబర్ 25 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని ఎల్గోయి గ్రామంలో నిమ్జ్‌లో కోల్పోతున్న బాధిత రైతుల భూములను జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి సందర్శించారు. ఈనెల 23న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమై 'పరిహారం.. పరిహాసం' అనే వార్త కథనానికి శుక్రవారం సంబంధిత జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జహీరాబాద్ నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి సంబంధిత అధికారులతో కలిసి ఎల్గోయి గ్రామాన్ని సందర్శించారు. భూములు కోల్పోయినా నష్టపరిహారం రాని బాధిత రైతుల భూములను ఆమె పరిశీలించారు. 1975 నుంచి 2024 వరకు భూముల రికార్డులను బాధిత రైతులు డిప్యూటీ కలెక్టర్‌కు అందజేశారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం 2016లో సేకరించిన భూములకు పరిహారం మంజూరై నప్పటికీ తమకు ఎందుకు చెల్లించలేదంటూ బాధిత రైతులు అధికారులను ప్రశ్నించారు. అప్పట్లోనే 54 సర్వే నంబర్‌లో భూములు కోల్పోయిన బాధిత రైతులకు పరిహారం చెల్లించామని డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అప్పట్లో లంచాలు ఇవ్వకపోవడంతోనే బై నంబర్లు సృష్టించి ఇతరులకు పరిహారాన్ని ఎలా చెల్లించారని అధికారులను బాధిత రైతులు నిలదీశారు. పట్టా సర్టిఫికెట్లు ఉంటే భూములు ఎందుకు దున్ని పంటలు సాగుచేయలేదని డిప్యూటీ కలెక్టర్ బాధిత రైతులను ప్రశ్నించారు. ఆ భూముల్లో పంటలు సాగుచేస్తే కేసులు నమోదు చేస్తామని మండల రెవెన్యూ అధికారులు హెచ్చరించడంతో సాగు చేయలేదని బాధిత రైతులు వాపోయారు. తమకు పరిహారం చెల్లించే వరకు ఊరుకోమని, కోర్టులను ఆశ్రయిస్తామని చెప్పారు. కలెక్టర్‌ను నివేదిక పంపి బాధిత రైతులకు న్యాయం చేస్తామని డిప్యూటీ కలెక్టర్ చెప్పారు. ఆమె వెంట అధికారులు సిద్ధారెడ్డి, రామారావు, సర్వేయర్ నర్సింలు ఉన్నారు. తమ గోడును జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చిన 'నమస్తే తెలంగాణ'కు బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పైసా ఖర్చు లేకుండా వైద్యం చేయిస్తా

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 25 : జనగామ నియోజకవర్గ ప్రజలకు పైసాఖర్చు లేకుండా తన సొంత దవాఖానలో వైద్యసేవలు, మందులు అందిస్తున్నానని, దీంతో పాటు ఇతర దవాఖానల్లో వైద్యం చేయించుకున్న వారికి ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయిస్తున్నానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం చేర్యాలలోని ఓ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన 64 మందికి రూ.17,94,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కారు పాలనలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అధికంగా ఉండేదని, అదే కాంగ్రెస్ పాలనలో రూ.60వేలకు మంచి మంజూరు కావడం లేదన్నారు. దీంతో బాధితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి 10 నెలల కాలంలో 750 చెక్కులను మంజూరు చేయించానని, మరో 15 రోజుల్లో 150 చెక్కులు మంజూరు అవుతాయని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మున్సిఫల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, ముస్త్యాల నాగేశ్వర్ రావు,అనంతుల మల్లేశం, గీస భిక్షపతి, వుల్లంపల్లి కరుణాకర్, సిలువేరు సిద్ధప్ప, సుంకరి మల్లేశం,తలారి కిషన్, రాజేందర్‌రెడ్డి, శివగారి అంజయ్య, జింకల పర్వతాలు, బొంగు రాజేందర్‌రెడ్డి, తాండ్ర సాగర్,గదరాజు చందు, గోనే హరి, మంచాల కొండయ్య, పచ్చిమడ్ల మానస, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల సిద్దిరాములు, బీరెడ్డి ఇన్నారెడ్డి, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

జహీరాబాద్ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న కస్తుర్బా గురుకుల పాఠశాల విద్యార్థినులు

న్యాల్‌కల్ కస్తుర్బా గురుకుల పాఠశాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

జహీరాబాద్, అక్టోబర్ 25: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లోని కస్తుర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాలలో వైరల్ ఫీవర్‌తో తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ సమస్యలతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గురు, శుక్రవారాల్లో విద్యార్థినులు తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడగా ఉపాధ్యాయులు, సిబ్బంది స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యాధికారులు విద్యార్థులను పరీక్షలు చేశారు. విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే 108 వాహనంలో జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. 13 మంది విద్యార్థినులు దవాఖానలో చికిత్స పొందుతున్నారని కస్తుర్బా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రుబీనా పర్వీన్‌బేగం తెలిపారు. డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వెంకటేశం, జిల్లా బాలిక విద్యాభివృద్ధి అధికారి మాధవి, ఎంపీడీవో రాజశేఖర్, ఎంపీవో సురేశ్, ఎంఈవో మారుతీరాథోడ్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులు తీవ్ర అసవస్థకు గురైతే ఎందుకు సమాచారం ఇవ్వలేదని సిబ్బందిపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మెమో జారీ చేయాలని జిల్లా బాలికల విద్యాభివృద్ధి అధికారి మాధవిని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులతో మాట్లాడారు. అధైర్యపడవద్దని, సమస్యలుంటే వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సిబ్బందికి అధికారులు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో వెంకటేశ్వర్లు సందర్శించి విద్యాబోధన, మధ్యాహ్న భోజనం తదితర వివరాలు పరిశీలించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంపై న్యాల్‌కల్ పీహెచ్‌సీ వైద్యాధికారి అమృత్‌రాజ్‌ను విలేకరులు అడగగా, వైరల్ ఫీవర్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు తెలిపారు.

గురుకులాన్ని షిఫ్ట్ చేస్తాం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

మర్కూక్ పోలీస్ గృహ సముదాయాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

మర్కూక్, అక్టోబర్ 25: సోషల్ వెల్ఫేర్ ఎస్సీ గురుకుల పాఠశాల నిర్వహణకు మర్కూక్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న పోలీస్ గృహ సముదాయాలు అనువుగా ఉన్నాయని, సంబంధిత అధికారులు వెంటనే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మను చౌదరి ఆదేంచారు. శుక్రవారం కలెక్టర్ మనుశౌదరి, పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఆయా అధికారులతో కలిసి మర్కూక్ పోలీస్ స్టేషన్, పోలీస్ బ్యారక్స్, సమీకృత కార్యాలయ భవనాల నిర్మాణ పనులు, కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ గృహ సముదాయాలు వాడకంలో లేని కారణంగా సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలగా మార్చేందుకు పరిశీలించామన్నారు. కొండపాక మండలంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థను ఇక్కడికి తరలిస్తామన్నారు. అనంతరం మర్కూక్‌లోని కస్తూర్బా విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. వాన పడితే నీరు విద్యాలయ ప్రాంగణంలోకి చేరి చెరువును తలపిస్తున్నదని ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కరాస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో బన్సీలాల్, అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి ప్రత్యూష, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మర్కూక్ తహసీల్దార్ అరీఫా, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో పాల్గొన్నారు.

కార్యక్రమాల అమలు అద్భుతం

- సిద్దిపేట బల్దియా కృషిని ప్రశంసించిన మున్సిపల్ కమిషనర్ల బృందం

సిద్దిపేట, అక్టోబర్ 25: సిద్దిపేట మున్సిపాలిటీలో అమలు చేస్తున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ల బృందం ప్రశంసించింది. పర్యటనలో భాగంగా రెండోరోజు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సువార్త, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ మనోహర్, భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ కమర్ అహ్మద్, చొప్పదండి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ కె.ప్రసన్న రాణి, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సీఎంఎన్ రాజు, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్లు పట్టణంలో పర్యటించారు. 31 వ వార్డులో పర్యటించి తడి,పొడి, హానికర చెత్తను వేరు చేయు విధానాన్ని పరిశీలించారు. వన మహోత్సవంలో పాల్గొని మొక్కలను నాటారు. బుస్సాపూర్ లోని రిసోర్స్ పార్క్‌ను సందర్శించి తడి చెత్తతో బయోగ్యాస్ తయారీ, బయోమైనింగ్ ఇన్సినరేటర్ నిర్వహణను పరిశీలించారు. స్లాటార్ హౌస్‌ను పరిశీలించి దాని నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ బోర్డులోని చెత్త సేకరణ కేంద్రం సందర్శించి చెత్తను వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. పట్టణంలో కమర్షియల్ వేస్ట్‌ను సేకరించే బాసిల్ కేంద్రాన్ని పరిశీలించారు. స్వచ్ఛబడిలో సిద్దిపేట పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల అమలును మున్సిపల్ కమిషనర్లకు సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వివరించారు. పర్యటనకు వచ్చిన కమిషనర్లు మాట్లాడుతూ.. సిద్దిపేట ఒక అధ్యయన కేంద్రంగా ఉందని, చాలా అంశాలు నేర్చుకున్నామని, ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ప్రశంసించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనక రాజు, కౌన్సిలర్ దీప్తి నాగరాజు, డాక్టర్ డీఎన్ స్వామి, సెంటర్ ఇన్‌స్పెక్టర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలోని డీఆర్‌సీ సెంటర్‌లోని చెత్తను వేరు చేసే విధానాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ల బృందం

సిద్దిపేట పట్టణంలోని 31 వార్డులో చెత్తను వేరు చేసే విధానాన్ని పట్టణవాసులను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్లు

పాలిటెక్నిక్ కళాశాల సమస్యలు పరిష్కరిస్తాం

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్

మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్

గజ్వేల్, అక్టోబర్ 25: గజ్వేల్‌లోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ అన్నారు. శుక్రవారం ఉదయం కళాశాలోని హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లు, వసతిగృహం గదులు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యార్థం మంచినీటి ఆర్‌వో ప్లాంటు, లైబ్రరీలో పుస్తకాలు, క్రీడసామగ్రిని విద్యార్థులకు సమకుర్చుతామన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్నదని, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. త్వరలోను వసతిగృహానికి నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. ప్రత్యేక నిధుల నుంచి పది స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు పెండింగ్ ఉపకార వేతనాలను విడుదల చేస్తామని తెలిపారు. రూ.15లక్షలతో ల్యాబ్‌ల మరమ్మతులు ఎమ్మెల్సీ నిధులతో చేపడుతామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్, నాయకులు భాస్కర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.